



EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
బుధవారం
07-05-2025
పేజీలు: 02







# పాక్ ఉగ్ర స్థావరాలపై ఇండియన్ ఆర్మీ మెరుపు దాడులు

## పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం – ఆపరేషన్ సింధూర్

జమ్మూ కశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో 26 మంది భారత పర్యాటకులను పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్చిచంపారు. ఈ ఘటనను యావత్ భారతదేశంతో పాటు పలు దేశాలు కూడా తీవ్రంగా ఖండించాయి. ఈ ఘటనపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్‌కు సరైన సమాధానం ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రంగా హెచ్చరించారు.ఈ క్రమంలోనే పాకిస్తాన్‌పై ఊహించని విధంగా భారతదేశం దాడులు చేసింది.
పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ మెరుపు దాడులు చేసింది. ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్ర శిబిరాలపై భారత దళాలు దాడులు చేశాయి. పీవోకేలో 9 ప్రాంతాలపై భారత్ సైన్యం దాడులు చేసింది. పీఓకేతో పాటు పాకిస్తాన్‌లో మౌలిక సదుపాయాలను కూడా భారత దళాలు ధ్వంసం చేశాయి. ఈ దాడిలో 30 మంది పాకిస్తాన్ ఉగ్రవాదులు మృతిచెందగా పలువురు గాయపడినట్లు సమాచారం.

### ‘ఆపరేషన్ సిందూర్’.. కలిసి నిలబడదామంటూ ప్రముఖుల పోస్ట్‌లు

పహల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారం తీర్చుకున్న భారత్. ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై మెరుపు దాడి. దీనిపై ప్రముఖుల ప్రశంసలు. కలిసి నిలబడదామంటూ ఎక్స్ వేదికగా పోస్ట్‌లు

### ఆపరేషన్ సిందూర్.. 80 మంది ఉగ్రవాదులు మృతి

పహల్గాం ఉగ్ర దాడికి నిరసనగా భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్థాన్‌లోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసింది. ఇందులో 80 మందికి పైగా ఉగ్రవాదులు మృతి చెందారు. బహవల్ పూర్ లోని మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజార్ హెడ్ క్వార్టర్, జైషే మహమ్మద్‌కు చెందిన మదర్సాలో ఉగ్రవాదులు ఉన్నారన్న పక్కా సమాచారంతో ఆర్మీ మెరుపు దాడి చేసింది.



### వాళ్లకు న్యాయం చేయడమే ఆపరేషన్ సింధూర్ లక్ష్యం

పహల్గామ్ ఉగ్రదాడిలో కళ్లముందే భర్తలను కోల్పోయిన భార్యలకు చేసే న్యాయమే ఆపరేషన్ సింధూర్. కేంద్రం ఆ అర్థంలోనే ఈ ఆపరేషన్‌కు ఆ పేరు ఖరారు చేసింది. అదీగాక కుంకుమ పువ్వుకు ప్రసిద్ధి గాంచిన కశ్మీర్ లోయలో పహల్గామ్ ఉగ్రదాడులతో పాకిస్తాన్ రక్తం పారించింది. పాక్ ఉగ్రదాడికి జవాబుగా ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతీకార దాడులు చేపట్టింది భారత సైన్యం.

### ఆపరేషన్ సింధూర్ అంటే..

ఆపరేషన్ సింధూర్. ఎందుకీ పేరు? పహల్గామ్‌దాడిలో ఉగ్రవాదులు పురుషులను మాత్రమే ఎంచుకుని కాల్చి చంపి, ఎందరో మహిళల నుదుటి సిందూరం తుడిచేసిన కారణంగానే ఆపరేషన్‌కు ‘సింధూర్’ అని నామకరణం చేశారు.

### 4 జైషే స్థావరాలు ధ్వంసం

భారత్ దాడిలో 4 జైషే స్థావరాలు ధ్వంసం అయ్యాయి. ఇందులో మూడు లష్కరే స్థావరాలు ఉన్నాయి. LOC దగ్గర పలువురు పాక్ ఆర్మీ సైనికులు హతమైనట్లు తెలుస్తోంది. మొదట కాల్పులు మొదలుపెట్టింది పాక్ సైన్యమేనని భారత్ ప్రకటించింది. దీంతో భారత్ ప్రతి దాడుల్లో పాక్ సైనికులు హతమైనట్లు పేర్కొంది.
వైమానిక ప్రాంతాన్ని మూసివేసిన పాక్
భారత దాడి తర్వాత పాకిస్తాన్‌లో అత్యవసర పరిస్థితి నెలకొంది. దీంతో 48 గంటల పాటు తన వైమానిక ప్రాంతాన్ని మూసివేసింది.


### 'పహల్గాం బాధితులను చట్టం ముందు నిలబెడతాం'

భారతదేశంపై ఉగ్రదాడులకు ప్రణాళికలు వేస్తూ అమలు చేస్తున్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు భారత సైన్యం తెలిపింది. తమ చర్యలు పూర్తిగా కేంద్రీకృతమైనవనీ, కచ్చితత్వంతో తీవ్రతరం కాని విధంగా దాడులు చేసినట్లు భారత సైన్యం వెల్లడించింది. లక్ష్యాల ఎంపిక, దాడుల అమలులో పూర్తి సంయమనం పాటించామని తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టేందుకు కట్టుబడి ఉన్నామని సైన్యం స్పష్టంచేసింది.
'న్యాయం జరిగింది'
పహల్గాం ఉగ్రదాడికి న్యాయం జరిగిందంటూ సర్వ్‌డ్ జస్టిస్ అని పోస్టు చేసింది. దాడి చేసేందుకు సిద్ధంగా ఉంటామనీ, విజయం సాధించేందుకే శిక్షణ పొందామని అర్థం వచ్చేలా ప్రహరాయ్ సన్నిహితా, జయాయ్ ప్రశిక్షితా అంటూ సంస్కృత వ్యాఖ్యాన్ని జోడించింది.




### భారత్ ధ్వంసం చేసిన ఉగ్రస్థావరాలు ఇవే..

1. 9 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన భారత సైన్యం
2. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కి.మీ లోపు ఉన్న స్థావరాలపై టార్గెట్ చేసిన భారత్
3. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కి.మీ దూరంలో ఉన్న బహవల్‌పూర్‌లో ఉన్న జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం
4. మురిడ్కే, సాంబా ఎదురుగా సరిహద్దుకు 30 కి.మీ దూరంలో ఉన్న లష్కరే క్యాంప్
5. సరిహద్దు నియంత్రణ రేఖ పూంఛ్- రాజౌరీకి 35 కి.మీ దూరంలో ఉ‌న గుల్పూర్
6. పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్ లోపల 30కి. మీ పరిధిలో ఉన్న సవాయ్ లష్కరే క్యాంప్
7. జేఎం లాంచ్‌ప్యాడ్ బిలాల్ క్యాంప్
8. రాజౌరీకి ఎదురుగా నియంత్రణ రేఖకు 15 కి.మీ.ల దూరంలో ఉన్న జేఎం లాంచ్‌ప్యాడ్ బిలాల్ క్యాంప్
9. రాజౌరీకి ఎదురుగా నియంత్రణ రేఖకు 10.కి.మీ పరిధిలో ఉన్న బర్నాలా క్యాంప్
10. సాంబా-కతువా ఎదురుగా అంతర్జాతీయ సరిహద్దుకు 8కి. మీ దూరంలో ఉన్న సర్జల్ క్యాంప్. ఇది జేఎంకు ఒక క్యాంప్.
11. అంతర్జాతీయ సరిహద్దు కు 15 కిమీ దూరంలో సియాల్‌కోట్ సమీపంలో ఉన్న హెచ్ఎం శిక్షణా శిబిరం మెహమూనా క్యాంప్





నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## ఆ మహిళల ప్రతీకారానికి చిహ్నమే ‘ఆపరేషన్ సిందూర్’

ఏప్రిల్ 22న మధ్యాహ్నం వేళ చల్లని గాలులకు సేదతీరుతున్న పర్యాటకులను ఉగ్రమూకలు లక్ష్యంగా చేసుకుని.. మరి మతం అడిగి కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఉగ్రమూకలు లక్ష్యంగా చేసుకున్న జంటల్లో అప్పటికే ఆరు రోజుల క్రితమే వివాహమై, హనీమూన్‌కు వచ్చిన నవ దంపతులు వినయ్ నర్వాల్, హిమాన్షిని టెర్రరిస్టులు చుట్టుముట్టారు. ఉగ్రవాదులు వినయ్‌ని హత్య చేయగా, అతడి మృతదేహం వల్ల గుండెలవిసేలా రోదిస్తున్న హిమాన్షి చిత్రం దేశం మొత్తాన్ని కదిపేసింది. వినయ్ నేవి అధికారి కూడా. ఈ ఉగ్రదాడిలో భర్తలను కోల్పోయిన మహిళల ప్రతీకారానికి చిహ్నంగా ఆపరేషన్ సిందూర్‌ను చూడొచ్చని మాజీ సైనిక అధికారులు పేర్కొంటున్నారు. యోధులకు పెట్టే వీరతిలకం అనే అర్థం కూడా దీనిలో ఉందని చెబుతున్నారు. ఆపరేషన్ సిందూర్.. పహల్గాం ఉగ్రదాడిలో తమ భర్తలను కోల్పోయిన మహిళల సిందూర్‌ను తిరిగి ఇచ్చే బాధ్యత మనందరిది అని ఓ మాజీ సైనికాధికారి పేర్కొన్నారు. కాబట్టి ఆర్మీ వాళ్లు చాలా చాలా ఆలోచించి ఆ ఆపరేషన్‌కు ఆపరేషన్ సిందూర్ అని నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు.




## తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి గొప్పవన్న మిస్ ఇండియా నందిని గుప్తా

హైదరాబాద్ నగరం ప్రతిష్ఠాత్మక ప్రపంచ సుందరి మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఈ అంతర్జాతీయ వేడుక కోసం వందకు పైగా దేశాల నుంచి అందాల భామలు భాగ్యనగరానికి తరలివస్తున్నారు. వారికి ఘన స్వాగతం పలికేందుకు శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో, పోటీల నిర్వహణపై హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.మిస్ ఇండియా నందిని గుప్తా మాట్లాడుతూ, తెలంగాణ గురించి ప్రస్తావించిన ప్రతిసారీ తనకు గొప్ప అనుభూతి కలుగుతుందని అన్నారు. ఈ ప్రాంత సంస్కృతి, అభివృద్ధి అద్భుతంగా ఉన్నాయని ఆమె ప్రశంసించారు. హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడి ప్రజలు ఎంతో ఆప్యాయతను పంచుతారని తెలిపారు. హైదరాబాదీ బిర్యానీ నుంచి ఇరానీ చాయ్ వరకు స్థానిక వంటకాలు అమోఘంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి యువతి ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని నందిని గుప్తా అభిప్రాయపడ్డారు.

# ప్లేఆఫ్స్‌లో గుజరాత్




ఈ సీజన్‌లో వరుసగా ఆరు విజయాలతో దూకుడు మీదున్న ముంబై ఇండియన్స్ జోరుకు బ్రేక్ పడింది. అప్రతిహతంగా సాగుతున్న ఆ జట్టు జైత్రయాత్రకు గుజరాత్ టైటాన్స్(జీటీ) కళ్లెం వేసింది. ఈ సీజన్‌లో వరుసగా ఏడో విజయంతో తిరిగి అగ్రస్థానంతో పాటు ప్లేఆఫ్స్ బెర్తునూ ఖాయం చేసుకోవాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబైని గుజరాత్ ఓడించి షాకిచ్చింది. మంగళవారం రాత్రి వాంఖడే వేదికగా హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ముంబైపై 3 వికెట్ల తేడాతో(డక్‌వర్త్ లూయిస్) జీటీ ఉత్కంఠ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. ప్రధాన బ్యాటర్ల వైఫల్యంతో నిర్ణీత ఓవర్లలో 155/8కే పరిమితమైంది. విల్ జాక్స్ (35 బంతుల్లో 53, 5 ఫోర్లు, 3 సిక్సులు), సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 35, 5 ఫోర్లు) ఆ జట్టును ఆదుకున్నారు. గుజరాత్ బౌలర్లలో సాయి కిషోర్ (2/34), గెరాల్డ్ కొయెట్జ్ (1/10), అర్షద్ ఖాన్ (1/18), రషీద్ ఖాన్ (1/21), సిరాజ్ (1/29) సమిష్టిగా సత్తాచాటారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన గుజరాత్ వర్షం అంతరాయం కల్గించే సమయానికి 19 ఓవర్లలో 147/7 స్కోరు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(43), బట్లర్(30) రాణించారు. బుమ్రా (2/19), బౌల్ట్(2/22) ఆకట్టుకున్నారు. వర్షం అంతరాయంతో డకవర్త్ లూయిస్ ప్రకారం గుజరాత్ విజయానికి 6 బంతుల్లో 15 పరుగులు అవసరం కాగా, కొట్జె(12) ఔటైనా..తెవాటియా(11 నాటౌట్), అర్షద్‌ఖాన్(1 నాటౌట్) జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టారు.


**ఆ ఇద్దరి దూకుడుతో..**

గత మ్యాచ్‌లలో ముంబైకి మెరుపు ఆరంభాలను అందించిన ముంబై ఓపెనర్లు రికెల్టన్ (2), రోహిత్ (7) ఆదిలోనే పెవిలియన్‌కు చేరడంతో ఆ జట్టుకు మొదట్లోనే షాకులు తాకాయి. సిరాజ్ రెండో బంతికే రికెల్టన్ ఇచ్చిన క్యాచ్‌ను కవర్స్‌లో సుదర్శన్ అందుకోగా లెఫ్టార్మ్ పేసర్లను ఆడటంలో తంటాలుపడే రోహిత్.. మరోసారి అదే బలహీనతను చాటుతూ అర్షద్ నాలుగో ఓవర్లో మిడాఫ్ వద్ద ప్రసిద్ధ్ చేతికి చిక్కాడు. ఎదుర్కొన్న రెండో బంతికే సుదర్శన్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన జాక్స్‌కు సూర్య జతకలవడంతో ముంబై స్కోరువేగం పుంజుకుంది. సిరాజ్ మూడో ఓవర్లో జాక్స్ 6,4 కొట్టగా.. ప్రసిద్ధ్ 5వ ఓవర్లో సూర్య మూడు బౌండరీలు రాబట్టాడు. అర్షద్ ఆరో ఓవర్లో జాక్స్ కూడా మూడు ఫోర్లు బాదాడు. ఈ ద్వయం దూకుడుతో పది ఓవర్లకు ముంబై 89/2తో పటిష్ఠంగానే నిలిచింది. సాయి కిషోర్ 11వ ఓవర్లో లాంగాఫ్ మీదుగా సిక్స్ కొట్టిన జాక్స్ అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. కానీ ఇదే ఓవర్లో సూర్య.. భారీ షాట్ ఆడబోయి లాంగాఫ్‌లో షారుక్‌కు క్యాచ్ ఇవ్వడంతో 71 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సూర్య నిష్క్రమణతో ముంబై ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. రషీద్.. జాక్స్‌ను బోల్తా కొట్టించగా మరుసటి ఓవర్లో సాయి.. హార్దిక్‌ను ఔట్ చేయడంతో ముంబై ఐదో వికెట్ కోల్పోయింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన కొయెట్జ్.. తిలక్ (7)ను పెవిలియన్‌కు పంపాడు. నమన్ (7) సైతం నిరాశపరచగా ఆఖర్లో కార్బిన్ బాష్ (27) మెరుపులతో ముంబై పోరాడగలిగే స్కోరును సాధించింది.

**సంక్షిప్త స్కోర్లు**

ముంబై: 20 ఓవర్లలో 155/8 (జాక్స్ 53, సూర్య 35, సాయి కిషోర్ 2/34, కొయెట్జ్ 1/10);
గుజరాత్: 19 ఓవర్లలో 147/7(గిల్ 43, బట్లర్ 30, బుమ్రా 2/19, బౌల్ట్ 2/22)

## కాంతార 2 షూటింగ్‌లో అపశృతి.. ఆర్టిస్ట్ దుర్మరణం



కాంతార చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఎంత ప్రభంజనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కన్నడలో విడుదలైన ‘కాంతార’ రికార్డుస్థాయి వసూళ్లను రాబట్టి అందరిని ఆశ్చర్యపరిచింది. రిషబ్ శెట్టి ఈ సినిమాలో హీరో మాత్రమే కాదు, రచయిత — దర్శకుడు కూడా ఆయనే. తొలి పార్ట్ మంచి సక్సెస్ కావడంతో ఇప్పుడు రెండో పార్ట్‌ని ‘కాంతార: చాప్టర్ 1’ పేరుతో తెరకెక్కిస్తున్నారు. ఈ సీక్వెల్‌ను అక్టోబర్ 2, 2025న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటన చేశారు. కాంతార సినిమా 2022 సెప్టెంబర్ చివర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. సరిగ్గా మూడు సంవత్సరాల తర్వాత కాంతార ప్రీక్వెల్ రాబోతుంది. కాంతార సినిమాకి సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్ చేస్తున్న నేపథ్యంలో మూవీపై ఆసక్తి పెరిగింది. షూటింగ్ ముగిసిన తర్వాత కపిల్ తన బృందంతో కలిసి కొల్లూరులోని సౌపర్ణిక నదిలో ఈతకు వెళ్లాడు. నీటి లోతు అంచనా వేయలేక నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తుంది. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జూనియర్ ఆర్టిస్ట్ మరణంతో చిత్ర బృందం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. ఈ సంఘటన గురించి మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. దీనిపై చిత్ర బృందం ఒక అధికారిక ప్రకటన వెలువరించనుందని సమాచారం.

## పాక్ విచక్షణారహితంగా కాల్పులు.. ముగ్గురు భారత పౌరులు మృతి



పహల్గాం ఉగ్రదాడికి బదులుగా పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం మంగళవారం అర్ధరాత్రి మెరుపు దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నియంత్రణ రేఖ వద్ద పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించింది. పాకిస్తాన్ విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ముగ్గురు భారత పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అమాయక ప్రజలను పాక్ బలిగొందని భారత సైన్యం తెలిపింది. దీనికి బదులు తీర్చుకుంటామని భారత్ పేర్కొంది.భారత ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ బలగాలు సంయుక్తంగా ఈ దాడిని నిర్వహించి, మిస్సైళ్లతో ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడ్డాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్తాన్‌లోని ఉగ్ర మౌలిక సదుపాయాలను పూర్తిగా ధ్వంసం చేశాయి. మొత్తం తొమ్మిది స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడులు చేపట్టింది.

## తెలంగాణలో నివాసముంటున్న పాకిస్తానీలను గుర్తించి, వెనక్కి పంపించాలి!



రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా.లక్ష్మణ్ గారి నేతృత్వంలో గవర్నర్ గారిని కలిసిన తెలంగాణ బిజెపి నేతలు.. దేశ భద్రతను దృష్టిలో పెట్టుకొని, ఇతర రాష్ట్రాలలో ఎలాగైతే పాకిస్తానీలను తమ దేశానికి పంపిస్తున్నారో, తెలంగాణలోనూ అక్రమంగా నివాసముంటున్న పాకిస్తానీలను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి, వెంటనే పంపించివేయాలని కోరుతూ గవర్నర్‌కు తెలంగాణ బిజెపి నేతలు వినతిపత్రం అందజేశారు.జమ్మూ కాశ్మీర్‌లో హిందువులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన దారుణమైన దాడి దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడికి పాకిస్తాన్ మద్దతు ఉన్న ఉగ్రవాదుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందని భారత ఇంటెలిజెన్స్ సంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో_ _ _ దేశ భద్రతకి ప్రమాదం కలిగించే వారిని తక్షణమే వెనక్కి పంపాల్సిన అవసరం ఉందని గవర్నర్ కి అందచేసిన వినతి పత్రంలో బిజెపి నేతలు పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో తెలంగాణ బీజేపీ ఉపాధ్యక్షుడు విజయ రామారావు, చింతల రామచంద్రా రెడ్డి, సంకినేని వెంకటేశ్వరరావు, యెండల లక్ష్మీనారాయణ, ఎస్.వీ.ఎస్.ఎస్ ప్రభాకర్, తెలంగాణ బీజేపీ ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్ రెడ్డి, దుగ్యాల ప్రదీప్ కుమార్, కుమారి బంగారు శృతి, డా. కాసం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

### టీచర్లు క్లాస్ రూములో
## ఫోన్లు వాడకూడదు
### తెలంగాణ విద్యాశాఖ కీలక నిర్ణయం

ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించి రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వారు తరగతి గదుల్లో మొబైల్ ఫోన్లు వినియోగించేదుకు అనుమతి లేదు. ఈ మేరకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల్లో విభిన్న అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇంతకు ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకుంది.. దీని వెనక గల కారణాలు ఏంటి అంటే.. ప్రభుత్వ ఉపాధ్యాయులు తరగతి గదుల్లో, పాఠాలు చెప్పే సమయంలో మొబైల్ ఫోన్లు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై కసరత్తు ప్రారంభించింది. గతంలో కొన్ని చోట్ల.. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కొందరు టీచర్లు క్లాసులు చెప్పకుండా.. తరగతి గదిలో మొబైల్ ఫోన్ చూస్తూ టైమ్ పాస్ చేస్తున్నారంటూ స్థానిక ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు డీఈఓలకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయులు తరగతి గదుల్లో మొబైల్స్ వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా, హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల ముగిసిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా డీఈఓలకు పలు సూచనలు చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు.. తరగతి గదుల్లో మొబైల్ వాడటాన్ని పూర్తిగా నిషేధిస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని వెల్లడించారు. అంతేకాదు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు అతిక్రమించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని యోగితా రాణా సూచించారు. అయితే తెలంగాణ విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు మిశ్రమ స్పందనను కనబరుస్తున్నాయి. కొందరు ఉపాధ్యాయులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. అత్యవసర పరిస్థితుల్లో మొబైల్ ఫోన్ అవసరం అని చెబుతున్నారు. కానీ మరికొందరు మాత్రం విద్యాశాఖ తీసుకున్న ఈ చర్యను సమర్థిస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు ట్యాబ్‌లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

**అడ్మిషన్ల కోసం ప్రతి ఇంటికి టీచర్లు..**

ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లను పెంచడం కోసం సర్కార్ టీచర్లు.. జూన్ 1 నుంచి 11 వరకు తమ పాఠశాల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి పిల్లలను, వారి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించేందుకు ప్రోత్సహించాలి. ఐదు ఏళ్లు నిండిన పిల్లలను బడికి వచ్చేలా చేసేందుకు వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి అని తెలిపారు. అయితే,ఈ ప్రచారం సరిగా చేయకపోవడం కూడా అడ్మిషన్ల తగ్గుదలకు ప్రధాన కారణంగా మారిందని కొంతమంది మాజీ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. కనుక ఈ సారి టీచర్లు.. కచ్చితంగా అడ్మిషన్స్ సంఖ్యను పెంచాలని యోగితా రాణి తెలిపారు.





## సింగిల్‌గానే ఉన్నా!

‘కెరీర్ విషయంలో చాలా సంతోషంగా ఉన్నా. జయాపజయాలు మన చేతిలో ఉండవు. ప్రయత్నించడం వరకే మన పని. ఫలితంతో సంబంధం లేకుండా వృత్తిని ప్రేమిస్తూ ముందుకు వెళ్తున్నా’ అని చెప్పింది కథానాయిక కేతిక శర్మ. ఈ భామ శ్రీవిష్ణుతో కలిసి నటించిన తాజా చిత్రం ‘సింగిల్’ ఈ నెల 9న విడుదలకానుంది. గీతా ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రానికి కార్తీక్‌రాజు దర్శకుడు. ఈ సందర్భంగా మంగళవారం కేతిక శర్మ విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పూర్వ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తను ప్రాక్టికల్‌గా ఆలోచించే స్వతంత్ర భావాలు గల యువతి అని చెప్పింది. ఆద్యంతం చక్కటి వినోదంతో సాగే ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని, హృదయాన్ని తాకే ఎమోషన్స్ కూడా ఉంటాయని తెలిపింది.